


నెమలి వాహనంపై భావనారుషి

తెనాలి: షరాఫ్‌బజారులోని శ్రీ భద్రావతి సమేత శ్రీభావనారుషి స్వామి కల్యాణ మహోత్సవం సందర్భంగా శుక్రవారం రాత్రి నెమలి వాహనంపై స్వామిని ఊరేగించారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 552.40 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి కుడికాలువకు 2,799 క్యూసెక్కులు వదిలారు.



అమ్మవారికి సారె

నగరంపాలెం: ఆర్.అగ్రహారం శ్రీకన్యకా పరమేశ్వరి దేవస్థానంలో ఆత్మార్పణ దినోత్సవాలు శుక్రవారం ప్రారంభం అయ్యాయి. అమ్మవారికి సారె తీసుకొచ్చారు.

న్యూస్‌రీల్

మిర్చి యార్డు కార్యదర్శిగా చంద్రిక బాధ్యతల స్వీకారం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డు కార్యదర్శిగా ఎ.చంద్రిక శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. యార్డు ఇన్‌చార్జి సుబ్రమణ్యం నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించి, మొదటి ఫైల్‌పై సంతకం చేశారు. చంద్రిక మిర్చి కార్యదర్శిగా ఏడాదిపాటు డిప్యుటేషన్ మీద కొనసాగనున్నారు. చంద్రిక మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన గుంటూరు మిర్చి యార్డుకు పనిచేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆరుగాలం కష్టపడి పండించిన పంటను విక్రయించుకునేందుకు యార్డుకు వచ్చే మిర్చి రైతుల సంక్షేమానికి పెద్దపీట వేస్తానని స్పష్టం చేశారు. యార్డు అధికారులు, సిబ్బంది సహకారంతో గుంటూరు మిర్చి యార్డును ప్రథమ స్థానంలో నిలిపేందుకు కృషి చేస్తానన్నారు. అంతేకాకుండా ప్రస్తుత సీజన్‌లో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చర్యలు చేపడతామని ఆమె వివరించారు. పలువురు యార్డు అధికారులు, సిబ్బంది, పలు అసోసియేషన్ల నాయకులు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన చంద్రికను కలిసి అభినందనలు తెలియజేశారు.

శ్రీవాసవీ మాత ఆత్మార్పణ దినోత్సవం



తెనాలి: స్థానిక బోసురోడ్డులోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం శ్రీవాసవీ అమ్మవారి ఆత్మార్పణ దినోత్సవాన్ని నిర్వహించారు. అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష పూజలు, శోభాయాత్ర జరిగాయి. వేకువజామునే సుప్రభాతం, విఘ్నేశ్వర పూజ నిర్వహించారు. అనంతరం సత్రం కమిటీ పాలకవర్గ సభ్యులు వైశ్య పతాకాన్ని ఆవిష్కరించారు. అమ్మవారికి 11 పర్యాయాలు పంచామృతాలు, ఫలరసాలు, సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలు చేశారు. ఉత్సవాల్లో భాగంగా 102 మంది ఆర్య వైశ్య కన్యలచే కలశాలతో పట్టణంలో వైభవంగా శోభాయాత్ర నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి స్వాగతం పలికారు. అమ్మవారిని, ప్రాంగణంలోని శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి, నగరేశ్వరస్వామి వార్లను మంత్రి దర్శించుకున్నారు. మంత్రి మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని ఆకాంక్షించారు. ఈ వేడుకలు ప్రజ్ఞానంద సరస్వతి (బాలస్వామీజీ) ప్రత్యక్ష పర్యవేక్షణలో జరిగాయి. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. దేవస్థానం కమిటీ అధ్యక్షుడు నూకల వెంకట వేణుగోపాలరావు, కార్యదర్శి బూర్లె నరసింహారావు, వుప్పల వరదరాజులు, కొనిజేటి గోపికృష్ణ, గ్రంధి విశ్వేశ్వరరావు, నాళం రజనీ కుమార్, మద్దాళి శేషాచలం, ముప్పల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

దూరవిద్య బీఎల్ఐఎస్సీ ఫలితాలు విడుదల



ఏఎన్‌యూ: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ దూర విద్యా కేంద్రం గత అక్టోబర్, నవంబర్ నెలలో నిర్వహించిన బ్యాచిలర్ ఆఫ్ లైబ్రరీ సైన్స్ (బీఎల్ఐఎస్సీ) కోర్సు మొదటి, రెండో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను శుక్రవారం దూరవిద్య కేంద్రం డైరెక్టర్ ఆచార్య వి.వెంకటేశ్వర్లు, పరీక్షల కోఆర్డినేటర్ ఆచార్య డి.రామచంద్రన్‌లు విడుదల చేశారు. ఫలితాలను దూరవిద్య కేంద్రం వెబ్‌సైట్ డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.ఏఎన్‌యూసీడీఈ.ఇన్ఫో నుంచి పొందవచ్చునని వారు తెలిపారు. కార్యక్రమంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ కృష్ణవేణి, కోదండపాణి, ఉద్యోగులు టంకశాల వెంకటేశ్వర్లు, ఎల్ ఎస్.రాంబాబు, కంప్యూటర్ సెక్షన్ నిర్వాహకులు వలి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 2010 క్యూసెక్కులు విడుదల చేశారు. హైలెవల్ కాలువకు 106, బ్యాంక్ కెనాల్‌కు 130, తూర్పు కెనాల్‌కు 242, పశ్చిమ కెనాల్‌కు 120, నిజాంపట్నం కాలువకు 50, కొమ్మమూరు కాలువకు 930 క్యూసెక్కులు విడుదల చేశారు.



క్రయవిక్రయదారులతో రిజిస్ట్రార్ కార్యాలయంలో నెలకొన్న రద్దీ

రాబడే ముఖ్యం..

ప్రజలకే కష్టం!

కూటమి ప్రభుత్వం ధన దాహానికి రిజిస్ట్రేషన్ కార్యాలయాలకు ప్రజలు పోటెత్తుతున్నారు. భూముల రిజిస్ట్రేషన్ విలువల పెంపు నిర్ణయం శనివారం నుంచి అమల్లోకి తెస్తుండటంతో అదనపు భారం భరించలేక గురువారం, శుక్రవారం క్రయవిక్రయదారులు క్యూ కట్టారు. కనీస వసతులు లేక, సర్వర్లు మొరాయించడంతో నానా ఇబ్బందులకు గురయ్యారు.

- కూటమి సర్కార్ తీరుతో క్రయవిక్రయదారుల అవస్థలు
- భూముల రిజిస్ట్రేషన్ విలువల పెంపు ఫలితంగా రద్దీ
- కిక్కిరిసిన రిజిస్ట్రార్ కార్యాలయం
- మొరాయించిన సర్వర్లు
- అదనపు భారం భరించలేక క్యూ కట్టిన జనం

నరసరావుపేట టౌన్: క్రయవిక్రయదారులతో నరసరావుపేట రిజిస్ట్రార్ కార్యాలయం శుక్రవారం కిక్కిరిసింది. శనివారం నుంచి కూటమి ప్రభుత్వం పెంచిన భూముల మార్కెట్ విలువలు అమల్లోకి రానున్నాయి. ఈ క్రమంలో జిల్లాలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు కిటకిటలాడాయి. గత నాలుగు రోజుల నుంచి రాత్రి 9 గంటల వరకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు పనిచేశాయి. దీంతో కార్యాలయం వద్ద క్రయవిక్రయదారులు, వారి సహాయకులతో రద్దీ నెలకొంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత భూముల మార్కెట్ విలువలను అమాంతం పెంచింది. ఎటువంటి హేతుబద్ధీకరణ లేకుండా పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని భూములపై 50 శాతం వరకు పెంచారు. ఈ వ్యవహారంపై ప్రజల నుంచి వ్యతిరేకత రావటంతో జనవరి 1వ తేదీ నుంచి మార్కెట్ విలువ పెంచుతూ జీవో ఇచ్చినప్పటికీ వాయిదా వేసి ఫిబ్రవరి 1వ తేదీ నుంచి అమలుకు శ్రీకారం చుట్టారు. పెంచిన మార్కెట్ విలువల నుంచి తప్పించుకునేందుకు ముందుగానే కొందరు రిజిస్ట్రేషన్‌లు చేయించుకున్నారు. రోజూ కార్యాలయానికి వచ్చే క్రయవిక్రయాలదారుల కంటే రెండు రోజులుగా వచ్చిన వారు రెండింతలు ఎక్కువని కార్యాలయాల వర్గాలు చెబుతున్నాయి. నరసరావుపేట రిజిస్ట్రార్ కార్యాలయంలో సగటున రోజూ 100 రిజిస్ట్రేషన్‌లు జరుగుతాయి. ప్రస్తుతం ఆ సంఖ్య రెట్టింపు అయింది. సర్వర్ మొరాయించటంతో రిజిస్ట్రేషన్‌లకు ఆటకం కలిగింది. గంటలకొద్దీ క్రయవిక్రయదారులు కార్యాలయంలో వేచి ఉన్నారు. కనీస వసతులు కూడా లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



మాచర్లలో పడిగాపులు



పిడుగురాళ్లలో వేచి చూస్తున్న జనం

10 నుంచి ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సన్నాహాలు

- నేడు ఎథిక్స్, 3న పర్యావరణం పరీక్ష
- మార్చి ఒకటి నుంచి థియరీ పరీక్షలు

నరసరావుపేట ఈస్ట్: ఇంటర్మీడియట్ పరీక్షల నిర్వహణ శనివారం నుంచి ప్రారంభం కానుంది. విద్యార్థులలో నైతిక విలువలను, పర్యావరణంపై అవగాహన పెంపొందించేందుకు పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ప్రథమ సంవత్సరం వారికి ఫిబ్రవరి 1వ తేదీన ఎథిక్స్ అండ్ హ్యూమన్ వాల్యూస్ పరీక్ష నిర్వహించనున్నారు. ఫిబ్రవరి 3వ తేదీన ఎన్విరాన్‌మెంటల్ ఎడ్యుకేషన్ పరీక్ష నిర్వహిస్తారు. విద్యార్థులు తమ కళాశాలల్లోనే పరీక్ష రాయవలసి ఉంటుంది. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు పరీక్ష ఉంటుంది. ఫిబ్రవరి 10 నుంచి 20 వ తేదీ వరకు ప్రాక్టికల్ పరీక్షలు ఉంటాయి. ఆదివారం సహా ఆయా తేదీలలో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, తిరిగి మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు నిర్వహిస్తారు. థియరీ పరీక్షలు మార్చి 1 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించేలా ఇంటర్ బోర్డు షెడ్యూల్ ప్రకటించింది. అలాగే సమగ్ర శిక్ష ఒకేషనల్ ట్రేడ్ పరీక్షను ఫిబ్రవరి 22న ఉదయం 10 నుంచి 12 గంటల వరకు నిర్వహిస్తారు.

హాజరు కానున్న 32,434 మంది

ఈ ఏడాది ఇంటర్ పరీక్షలకు 32,434మంది విద్యార్థులు హాజరు కానున్నారు. ప్రథమ ఏడాదిలో 16,811, ద్వితీయ సంవత్సరంలో 13,749 మంది ఉన్నారు. ఒకేషనల్ ప్రథమ - 1094, ద్వితీయ ఏడాదిలో 780 మంది ఉన్నారు. జనరల్ ప్రాక్టికల్ పరీక్షలకు 11,509 మంది హాజరుకానుండగా.. వీరిలో 9,583 మంది ఎంపీసీ, 1,926 మంది బైపీసీ విద్యార్థులు. ఒకేషనల్ ప్రాక్టికల్స్‌కు 1,094 మంది ప్రథమ, 780 మంది ద్వితీయ సంవత్సరం విద్యార్థులు హాజరు కానున్నారు.

మార్చి 8 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి



కార్యాలయంలో అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహిస్తున్న కలెక్టర్

- ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రపటాలు తొలగించాలి
- జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబు

నరసరావుపేట: కృష్ణా-గుంటూరు పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల ప్రకటనతో జిల్లాలో అమలులోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తనా నియమావళి మార్చి ఎనిమిది వరకూ కొనసాగుతుందని జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్సార్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి ఎమ్మెల్సీ ఎన్నికలపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా అధికారులు ఎన్నికల ప్రవర్తనా నియమావళిని తు.చ తప్పకుండా పాటించాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో రాజకీయ నాయకుల చిత్రపటాలు, నాయకుల ప్రకటనలతో ఉన్న క్యాలెండర్లను తొలగించాలన్నారు. కూడళ్లలో రాజకీయ నాయకుల విగ్రహాలకు నిబంధనల ప్రకారం ముసుగులు వేయాలన్నారు. గాంధీ, అంబేద్కర్ విగ్రహాలకు ముసుగులు వేయాల్సిన అవసరం లేదన్నారు. వెయ్యికి పైగా ఓటర్లున్న పోలింగ్ కేంద్రాలలో అదనపు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలన్నారు. తహసీల్దార్లు, ఎంపీడీవోలు పోలింగ్ కేంద్రాల్లో కనీస వసతుల కల్పన చేయాలన్నారు. డీఆర్వో మురళి, డీపీఓ భాస్కర్‌రెడ్డి, జిల్లా ఉద్యాన అధికారి సీహెచ్.వి.రమణారెడ్డి, జిల్లా పశు సంవర్థక అధికారి కె.కాంతారావు, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు పాల్గొన్నారు.

ఆశ పడ్డారు... మోసపోయారు

- రెట్టింపు నకిలీ నోట్లు ఇస్తామంటూ బురిడీ
- రూ.15 లక్షలు పోగొట్టుకున్న బాధితులు

మంగళగిరి (తాడేపల్లి రూరల్): అసలు కరెన్సీకి డబుల్ దొంగ కరెన్సీ ఇస్తామని ఆశ చూపిన వ్యక్తి చేతిలో మోసపోయిన ఘటన మంగళగిరి కాజ టోల్‌గేటు వద్ద గురువారం రాత్రి జరిగింది. మంగళగిరి రూరల్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరు జిల్లా పేరేచర్లలోని ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్న వ్యక్తికి చిత్తూరు జిల్లాలో ఓ మహిళ పరిచయమైంది. ఆమెతో నకిలీనోట్ల గురించి ప్రస్తావించాడు. రూ.15 లక్షలు అసలు నోట్లు ఇస్తే రెట్టింపు నకిలీనోట్లు ఇస్తామని ఆశ చూపించాడు. ఆ మహిళ ఈ విషయాన్ని తనకు తెలిసిన వాళ్లకు తెలియజేసింది. ఈ క్రమంలో చిత్తూరు జిల్లాకు చెందిన పగడాల జ్యోతి, వెంకటాచలం విశ్వనాథ్ దంపతులు ఆ మధ్యవర్తి ద్వారా డబ్బు ఇస్తానన్న వ్యక్తిని సంప్రదించారు. డబ్బులు తీసుకుని మంగళగిరి మండల పరిధిలోని కాజ టోల్‌గేటు వద్దకు రమ్మని ఆ వ్యక్తి చెప్పడంతో గురువారం రాత్రి 10.30 నిమిషాలకు పగడాల జ్యోతి, వెంకటాచలం విశ్వనాథ్‌లు రూ.15 లక్షల అసలు నోట్లను తీసుకుని వచ్చారు. ఈ క్రమంలో ఆ వ్యక్తి మరో వ్యక్తితో పథకం ప్రకారం టోల్‌గేటు వద్ద వేచి ఉన్నాడు. అనంతరం ఆ దంపతుల దగ్గర నగదు తీసుకున్నాడు. రూ.30 లక్షల నకిలీ నోట్లను ఒక సూట్‌కేసులో పెట్టి ఇచ్చాడు. నిమిషాల వ్యవధిలోనే పోలీసులు పోలీసులు అంటూ హడావిడి చేసి అక్కడి నుండి పారిపొమ్మని ఆ దంపతులను హెచ్చరించాడు. ఆ దంపతులు భయపడి సూట్‌కేస్ తీసుకుని అక్కడి నుండి వెళ్లిపోయారు. కొంత దూరం వెళ్లిన తరువాత సూట్‌కేస్ ఓపెన్ చేసి చూడగా నోట్ల కట్టలలో పైన కింద నోట్లు తప్ప మధ్యలో అన్నీ తెల్లకాగితాలు ఉండడం చూసి అవాక్కయ్యారు. బాధితులు మంగళగిరి రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

మిర్చికి ధర లభించేలా చూడాలి

- మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత
- వ్యాపారులు, అధికారులతో సమీక్ష



మాట్లాడుతున్న కమిషనర్ ఎం.విజయ సునీత

కొరిటిపాడు(గుంటూరు): మిర్చి రైతులకు ఆశించిన ధర లభించేలా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని మార్కెటింగ్ శాఖ కమిషనర్ ఎం.విజయ సునీత స్పష్టం చేశారు. గుంటూరు చుట్టుగుంటలోని మార్కెటింగ్ శాఖ రాష్ట్ర కార్యాలయం సమావేశ మందిరంలో మిర్చి ఎగుమతి, దిగుమతి వ్యాపారులు, మార్కెటింగ్ శాఖ అధికారులతో శుక్రవారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈ సంవత్సరం సీజన్ ప్రారంభం నుంచి మిర్చి ధరలు ఎందుకు పతనం అవుతున్నాయో ఎగుమతి వ్యాపారులను అడిగి తెలుసుకున్నారు. వ్యాపారులు వెలగపూడి సాంబశివరావు, తోట రామకృష్ణ, కొత్తూరి సుధాకర్, పి.నరేంద్ర, కె.వెంకటేశ్వరరావులు మాట్లాడుతూ ప్రస్తుతం మార్కెట్లో రైతులకు లభిస్తున్న ధరలు నిలకడగా ఉన్నాయని చెప్పారు. గతంతో పోలిస్తే చైనా, బంగ్లాదేశ్, నేపాల్ తదితర దేశాలకు ఎగుమతులు ఆశాజనకంగా లేవని తెలిపారు. ప్రస్తుతం శీతల గిడ్డంగులలో ఉన్న మిర్చి నిల్వలు ఎగుమతికి అనుకూలంగా లేవని పేర్కొన్నారు. దీంతో ధరలు ఆశించిన స్థాయిలో పెరగడం లేదని వెల్లడించారు. ఫిబ్రవరి 15వ తేదీ తర్వాత పంట దిగుబడులు, మిర్చి ఎగుమతులపై ఒక అంచనా వస్తుందని, అప్పటి వరకు మిర్చి ధరలు నిలకడగా ఉంటాయని వివరించారు. ఫిబ్రవరి 15 తర్వాత చైనా దేశం నుంచి ఎక్స్‌పోర్టర్స్ రావచ్చని, అప్పుడు ధరల్లో మార్పు రావచ్చని సూచించారు. ఇంతకన్నా మిర్చికి మార్కెట్ రాదని వారు స్పష్టం చేశారు. కమిషనర్ విజయ సునీత మాట్లాడుతూ.. రాష్ట్రంలో 1.94 లక్షల హెక్టార్లలో మిరప పంట సాగు చేయగా 11.29 లక్షల మెట్రిక్ టన్నులు దిగుబడి వస్తుందని అంచనా వేసినట్లు తెలిపారు. గుంటూరు మిర్చి యార్డుకు మన రాష్ట్రంలోని వివిధ జిల్లాలతోపాటు కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి కూడా రైతులు సరకు తెచ్చే అవకాశం ఉన్నందున గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. దీనికి సహకరించాలని ఎగుమతి వ్యాపారులకు సూచించారు. మిర్చి సీజన్ ప్రారంభమైనందున గుంటూరు మార్కెట్ యార్డుకు అధిక సంఖ్యలో బస్తాలు వస్తున్నందున అసౌకర్యం కలగకుండా చూడాలని యార్డు అధికారులను ఆదేశించారు. ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు తీసుకోవాలన్నారు. ఫిబ్రవరి 15వ తేదీ తర్వాత తదుపరి సమావేశం ఉంటుందని వెల్లడించారు. మార్కెటింగ్ శాఖ రీజినల్ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు, విజిలెన్స్ జేడీ రాజశేఖర్, ఏడీఎం బి.రాజబాబు, మిర్చి యార్డు కార్యదర్శి ఎ.చంద్రిక, వ్యాపారులు పాల్గొన్నారు.

జిల్లాకు చేరుకున్న టెన్త్ స్టడీ మెటీరియల్

సాక్షి ఎఫెక్ట్

సత్తెనపల్లి: టెన్త్ విద్యార్థులకు అవసరమైన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ ఎట్టకేలకు జిల్లాకు చేరింది. పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించేందుకు విద్యాశాఖ 100 రోజుల ప్రణాళిక అమలు చేస్తున్నప్పటికీ 58 రోజులు గడిచినా టెన్త్ విద్యార్థులకు అవసరమైన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ పంపిణీ చేయకపోవడంపై శుక్రవారం సాక్షిలో 'స్టడీ మెటీరియల్ ఏది?' శీర్షికన ప్రచురితమైన కథనానికి విద్యాశాఖ అధికారులు స్పందించారు. జిల్లాలోని సత్తెనపల్లి, నరసరావుపేట, గురజాల రెవెన్యూ డివిజన్లకు అవసరమైన విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్‌ను శుక్రవారం సరఫరా చేశారు. సత్తెనపల్లి రెవెన్యూ డివిజనకు మొత్తం 5,101 విద్యాజ్యోతి స్టడీ మెటీరియల్ ఉపవిద్యాశాఖాధికారి కార్యాలయానికి చేరుకున్నాయి. మిగిలిన వాటిని నరసరావుపేట, గురజాల రెవెన్యూ డివిజన్‌లకు తరలించారు. ఒకటి, రెండు రోజుల్లో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు నేతృత్వంలో ఈ స్టడీ మెటీరియల్‌ను టెన్త్ విద్యార్థులకు పంపిణీ చేసే కార్య క్రమాన్ని ప్రారంభించేందుకు విద్యాశాఖ అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.



సత్తెనపల్లి ఉప విద్యాశాఖాధికారి కార్యాలయం వద్ద అన్‌లోడ్ చేస్తున్న టెన్త్ స్టడీ మెటీరియల్

యువకుడిపై పోక్సో కేసు నమోదు

ముప్పాళ్ల: బాలికకు మాయమాటలు చెప్పి ప్రలోభాలకు గురి చేసి ఆమెను పెళ్లి చేసుకున్న యువకుడిపై పోక్సో కేసు నమోదు చేసినట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు శుక్రవారం తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి... ప్రకాశం జిల్లా మద్దిపాడుకు చెందిన ఓ కుటుంబం వ్యవసాయ పనుల నిమిత్తం మండలంలోని రుద్రవరం గ్రామానికి వచ్చింది. అలాగే అమర్తలూరు మండలానికి చెందిన రాపూరి శ్రీనివాసరావు తన భార్య, రెండేళ్ల కుమారుడితో అదే గ్రామానికి వ్యవసాయ పనులకు వచ్చారు. ప్రకాశం జిల్లా మద్దిపాడు గ్రామం నుంచి వచ్చిన కుటుంబంలోని బాలికకు మాయమాటలు చెప్పి ప్రలోభాలకు గురి చేశాడు. ఫోన్ కూడా కొనిచ్చాడు. తరచూ ఎవరికి తెలియకుండా ఫోన్‌లో మాట్లాడుకుంటూ ఉండేవారు. వ్యవసాయ పనులు ముగియటంతో ఇరు కుటుంబాల వారు ఎవరి గ్రామాలకు వారు వెళ్లిపోయారు. రాపూరి శ్రీనివాసరావు బాలికతో తరచూ ఫోన్‌లో మాట్లాడుతూ ఇరువురూ పారిపోయేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నారు. ఇరువురూ కలిసి జనవరి 5వ తేదీన తిరుపతి వెళ్లారు. అక్కడే పెళ్లి చేసుకొని తిరిగి మేడికొండూరు మండలం జంగంగుంట్లపాలెం వచ్చారు. అక్కడ ఓ రైతుకు చెందిన ఇల్లు అద్దెకు తీసుకొని పొలం పనులకు వెళుతున్నారు. బాలిక తల్లిదండ్రులు తమ కుమార్తె కనిపించడం లేదంటూ ముప్పాళ్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు ఫోన్ సిగ్నల్ ఆధారంగా శ్రీనివాసరావు ఆచూకీ గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. బాలికను తల్లిదండ్రులకు అప్పగించి, శ్రీనివాసరావుపై పోక్సో కేసు నమోదు చేసి కోర్టుకు హాజరు పరచగా, నిందితునికి రిమాండ్ విధించినట్లు ఎస్సై వి.సోమేశ్వరరావు తెలిపారు.


అదే నోటి దురుసు

మున్సిపల్ కౌన్సిల్ సభను అవమానించిన టీడీపీ ప్రజాప్రతినిధి

చీరాల: మున్సిపల్ చైర్మన్‌ను, కుర్చీని అవమానపరచిన టీడీపీ కౌన్సిలర్ ఎస్.సత్యానందం సభలో క్షమాపణ చెప్పాలంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని హాలులో శుక్రవారం కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించారు. సమావేశం ప్రారంభం కాగానే ఆయన్ను, చైర్మన్ సీటును 31వ వార్డు కౌన్సిలర్ సత్యానందం ఉద్దేశపూర్వకంగా అవమానించారని, సభకు ఆయన క్షమాపణ చెప్పాలంటూ వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో వైఎస్సార్ సీపీ, టీడీపీ కౌన్సిలర్ల మధ్య కొద్దిపాటి వాగ్వాదం చోటుచేసుకుంది. అయితే తాను సభను, చైర్మన్‌ను అవమానపరచలేదని, అయినా ఎవరికైనా ఇబ్బంది కలిగితే ఆ మాటలు వెనక్కి తీసుకుంటానని స్పష్టం చేశారు. అయితే, క్షమాపణలు చెప్పాలని వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు డిమాండ్ చేశారు. ఈ తరుణంలో టీడీపీ కౌన్సిలర్ సత్యానందాన్ని మూడు నెలల పాటు సస్పెండ్ చేస్తున్నట్లు చైర్మన్ ప్రకటించారు. అదే సమయానికి ఎక్స్ అఫీషియో మెంబర్ హోదాలో ఎమ్మెల్యే ఎంఎం కొండయ్య మున్సిపల్ సమావేశానికి హాజరయ్యారు. దీంతో కొంత సేపు హైడ్రామా నడిచింది. టీడీపీ కౌన్సిలర్ సత్యానందాన్ని సస్పెండ్ చేసిన విషయం తెలుసుకున్న ఆయన ఈ విషయాన్ని మరోసారి పరిశీలించాలని చైర్మన్‌కు సూచించారు.

తెనాలి జిల్లా వైద్యశాలలో విచారణ

- కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించటంతో మహిళ మృతి
- ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు వైద్యులను విచారించిన జేడీ



వైద్యులను విచారిస్తున్న జాయింట్ డైరెక్టర్

తెనాలి అర్బన్: తెనాలి జిల్లా వైద్యశాలలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ వికటించి మహిళ మృతి చెందిన ఘటనపై విచారణ జరిపేందుకు సెకండరీ హెల్త్ విభాగ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ టి. రమేష్ కిషోర్ శుక్రవారం తెనాలి వచ్చారు. తల్లీపిల్లల వైద్యశాలలో ఆపరేషన్ చేసిన సీనియర్ వైద్యులు డాక్టర్ రాంబాబు, ఇతర వైద్యులను అడిగి ఘటనకు సంబంధించిన వివరాలు సేకరించారు. జేడీ మాట్లాడుతూ మంగళగిరి మండలం యర్రబాలెంకు చెందిన గాజుల పావని ప్రసవం జరిగి 10 సంవత్సరాలు దాటిన తర్వాత కుటుంబ నియంత్రణ ఆపరేషన్ నిమిత్తం తెనాలి జిల్లా వైద్యశాలకు ఈ నెల 24వ తేదీ వచ్చిందని తెలిపారు. పీపీ యూనిట్ సీనియర్ వైద్యులు డాక్టర్ రాంబాబు, మరో సర్జన్ డాక్టర్ సింహాచలం సహకారంతో ఆమెకు ఆపరేషన్ చేశారన్నారు. మరుసటి రోజు ఆమెకు కడుపులో ఉబ్బరం రావటంతో స్కానింగ్ చేసి లోపల ఇబ్బంది ఉండటంతో గుంటూరుకు రిఫర్ చేశారని చెప్పారు. ఆ తర్వాత ఆమె మృతి చెందినట్లు పేర్కొన్నారు. దీనిపై విచారణ జరపాలని సెకండరీ హెల్త్ డైరెక్టర్ డాక్టర్ సిరి ఆదేశించటంతో తెనాలి వచ్చినట్లు తెలిపారు. సాధారణంగా డెలివరీ జరిగిన వెంటనే ఆపరేషన్ చేయించుకుంటే ఎటువంటి ఇబ్బందులు రావని, కొన్ని సంవత్సరాల తర్వాత అయితే సమస్యలు వస్తుంటాయని చెప్పారు. పీపీ యూనిట్ తమ పరిధిలోది కాదని, వైద్యశాల తమ పరిధిలో ఉండటంతో విచారణ జరుపుతున్నట్లు చెప్పారు. గుంటూరు వైద్యశాలలో కూడా దీనిపై విచారణ జరిపి సమగ్ర నివేదికను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ మజీదా బేగం, వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ సౌభాగ్యవాణి, పలువురు వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

యార్డులో 70,952 మిర్చి బస్తాలు విక్రయం

కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 61,331 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ-నామ్ విధానం ద్వారా 70,952 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్-5, 273, 341, 4884, సూపర్-10 రకాల సగటు ధర రూ.7,500 నుంచి రూ.15,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల సగటు ధర రూ.7,000 నుంచి రూ.14,500 వరకు ధర లభించింది.

క్లుప్తంగా

మాచర్ల హెల్త్ సెంటర్‌కు రూ.72.98 లక్షల నిధులు



నరసరావుపేట: మాచర్ల కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు 16 కీలక వైద్య పరికరాలు కొనుగోలు కోసం రూ.72.98 లక్షల నిధులను పవర్ గ్రిడ్ సదరన్ ఇంటర్ కనెక్టర్ ట్రాన్స్‌మిషన్ సిస్టమ్ లిమిటెడ్ సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద సమకూర్చనుంది. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ పి.అరుణ్‌బాబు సమక్షంలో జిల్లా ఆసుపత్రి సేవల సమన్వయ కర్తల(డీసీహెచ్ఎస్)తో అవగాహనా ఒప్పందం కుదుర్చుకుంది. డీసీహెచ్ఎస్ డాక్టర్ బీవీ రంగారావు, పీఎస్ఐటీఎస్ఎల్ తరఫున సీనియర్ జనరల్ మేనేజర్ కె.నాగమోహనరావు, జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ జి.శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సహకారంతో ఆసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందించడమే లక్ష్యమని పవర్ గ్రిడ్ ప్రతినిధులు పేర్కొన్నారు.

రేపటి నుంచి జాతీయస్థాయి ఎడ్ల బండలాగుడు పోటీలు

నాదెండ్ల: గణపవరం – నాదెండ్ల డొంక రోడ్డులోని నందికుంట విఘ్నేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం నుంచి 6వ తేదీ వరకు జాతీయస్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి రోజు ఉదయం 10 గంటలకు డ్రా అనంతరం మధ్యాహ్నం 2 గంటల నుంచి రెండు పళ్ల విభాగంలో పోటీలు ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. 3న నాలుగు పళ్ల, రాత్రి ఆరు పళ్ల విభాగాల్లో, 4న న్యూ కేటగిరి, 5న సబ్ జూనియర్స్, 6న జూనియర్స్ విభాగంలో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. 2, 4, 6 పళ్ల విభాగాల్లో ఏడు బహుమతులు, న్యూ కేటగిరీలో 9, సబ్ జూనియర్స్‌లో 7, జూనియర్స్‌లో 9 బహుమతులు ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. చివరిరోజు దేవదాయశాఖ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక అలంకరణ, అభిషేకాలు, భారీ అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు. వ్యాఖ్యాతగా గూడా శ్రీనివాసరావు, తంగెళ్ల హసన్ వ్యవహరించనున్నట్లు తెలిపారు.

బాపట్ల జిల్లా గిత్తలకు ప్రథమ స్థానం

హోరాహోరీగా బాపట్ల, ప్రకాశం జిల్లాల ఎడ్ల బలప్రదర్శన



ప్రథమ బహుమతి కైవసం చేసుకున్న బాపట్ల జిల్లా గిత్తల ప్రదర్శన

రెంటచింతల: స్థానిక కానుకమాత చర్చి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం స్థానిక సెయింట్ జోసఫ్ హైస్కూల్ క్రీడా మైదానంలో నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బలప్రదర్శనలో బాపట్ల, ప్రకాశం జిల్లాల గిత్తలు ప్రథమ స్థానం కోసం హోరాహోరీగా పోరాడాయి. న్యూ కేటగిరి విభాగంలో జరిగిన ఈ ప్రదర్శనలో బాపట్ల జిల్లా వేటపాలెం గ్రామానికి చెందిన అత్తోట శిరీషా చౌదరి, శివకృష్ణ చౌదరి గిత్తలు 3,900.9 అడుగుల దూరం లాగి ప్రథమ బహుమతి కైవసం చేసుకున్నాయి. ప్రకాశం జిల్లా సంతమాగులూరు గ్రామానికి చెందిన వజ్రాల తేజశ్రీరెడ్డి గిత్తలు 3,900 అడుగుల దూరం లాగి రెండవ బహుమతి దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా ఉప్పుమాగులూరు గ్రామానికి చెందిన టి.రవి శంకర్‌రెడ్డి గిత్తలు 3,300 అడుగుల దూరంలాగి 3వ బహుమతి కైవసం చేసుకున్నాయి. తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా కోదాడ గ్రామానికి చెందిన డాక్టర హుస్సేన్, పల్నాడు జిల్లా రెంటచింతల మండలం రెంటాల గ్రామానికి చెందిన పి. సూర్య అశ్విక్ యాదవ్ కంబైడ్ గిత్తలు 3,287.8 అడుగుల దూరం లాగి 4వ బహుమతి దక్కించుకున్నాయి. కృష్ణా జిల్లా తెంపల్లి గ్రామానికి చెందిన కె.శ్రీనివాస యాదవ్ గిత్తలు 3,135 అడుగుల దూరం లాగి 5వ బహుమతి గెలుచుకున్నాయి. పల్నాడు జిల్లా దొండపాడు గ్రామానికి చెందిన యర్రం రాజశేఖర్, యశ్వంత్ గిత్తలు 2,889.6 అడుగులు లాగి 6వ బహుమతి దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా మర్రి వేముల గ్రామానికి చెందిన సిద్ధి మల్లేశ్వరి గిత్తలు 2,840 అడుగులతో 7వ బహుమతి కైవసం చేసుకున్నాయి. గుంటూరు జిల్లా పాలడుగు గ్రామానికి చెందిన వి.శ్రీనివాసరావు, ఎస్.పవన్‌కుమార్ గిత్తలు 2,707 అడుగులు లాగి 8వ బహుమతి దక్కించుకున్నాయి. ప్రకాశం జిల్లా పొట్లపాడు గ్రామానికి చెందిన నుసుం బయ్యపురెడ్డి గిత్తలు 2,700 అడుగులు లాగి 9వ బహుమతి గెలుచుకున్నాయి. ఈ బలప్రదర్శనలో మొత్తం 10 జతలు పాల్గొన్నాయి. మిగిలిన ఒక జతకు కూడా రూ.3 వేలు అందజేసినట్లు కమిటీ సభ్యులు వైఎల్ మర్రెడ్డి, ఆదూరి ఇన్నారెడ్డి, అల్లం ప్రతాప్‌రెడ్డి, గొంటు సుమంత్‌రెడ్డి, ఓ.ఇన్నారెడ్డి, బి.రామకృష్ణ, మూలి రాజారెడ్డి, ఎం.చిన్న శౌర్రెడ్డి, కె.జోసఫ్‌రెడ్డి, గాదె కస్పారెడ్డి, గాలి ప్రకాష్‌రెడ్డి, వెన్నా కోటిరెడ్డి, ఏరువ జోజిరెడ్డి తెలిపారు. న్యాయనిర్ణేతలుగా రాధాకృష్ణ, పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి, శ్రీనివాస్ వ్యవహరించారు. శనివారం జూనియర్ విభాగంలో బలప్రదర్శన ఉంటుందన్నారు.



ద్వితీయ బహుమతి కైవసం చేసుకున్న ప్రకాశం జిల్లా గిత్తలు ప్రదర్శన

వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు బెయిల్ మంజూరు



బెయిల్‌పై విడుదలైన కార్యకర్తలు

వినుకొండ(నూజెండ్ల): బైకు దహనం కేసులో అరెస్ట్ అయిన 22 మంది వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు శుక్రవారం బెయిల్ మంజూరైంది. ఈ కేసులో పార్టీ ముస్లిం మైనార్టీ జిల్లా అధ్యక్షుడు పీఎస్ ఖాన్‌తో పాటు మరో 21 మందిని రిమాండ్ విధించి సబ్ జైలుకు పంపించారు. వీరి తరఫున ఆ పార్టీ అధికార ప్రతినిధి, న్యాయవాది ఎంఎస్ ప్రసాద్ కోర్టులో వాదనలు వినిపించారు. గతంలో రషీద్‌ను హత్య చేసిన నిందితుడు జిలానీ అన్న జిమ్ జానీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సెక్షన్లు మార్చి బెయిల్ పొందిన వారికి కూడా మళ్లీ రిమాండ్ విధించడం గమనార్హం. మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు బాధితులను జైల్లో పరామర్శించారు. అనంతరం బాధితుల పక్షాన బెయిల్ కోసం కృషి చేశారు. వినుకొండ సబ్ జైల్ నుంచి అందరూ విడుదలయ్యారు. దీంతో బాధితుల కుటుంబాలు హర్షం వ్యక్తం చేసి, బెయిల్ మంజూరు కృషి చేసిన నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

డ్వాక్రా రుణాల గోల్‌మాల్ కేసులో నిందితురాలి అరెస్టు

రేపల్లె రూరల్: డ్వాక్రా రుణాలను పక్కదారి పట్టించిన కేసులో నిందితురాలిని అరెస్ట్ చేసినట్లు పట్టణ సీఐ మల్లికార్జునరావు తెలిపారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడారు. పట్టణ పేదరిక నిర్మూలన సంస్థలో పనిచేస్తున్న పలువురు నకిలీ డ్వాక్రా గ్రూపులను సృష్టించి బ్యాంక్ నుంచి రుణాలు పొంది స్వాహా చేశారన్నారు. మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ వెంకట నారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఇప్పటికే ఒకరిని అరెస్ట్ చేశామన్నారు. 14వ వార్డుకు చెందిన కొమ్మల సువార్తకుమారిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపరచగా న్యాయస్థానం 15 రోజులు రిమాండ్ విధించిందన్నారు.

ఫీజు పోరును జయప్రదం చేయండి

మాజీ మంత్రి విడదల రజిని



ఫీజు పోరు పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి విడదల రజిని, నాయకులు

చిలకలూరిపేట: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈ నెల ఐదో తేదీన నిర్వహిస్తున్న ఫీజు పోరు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మాజీ మంత్రి విడదల రజిని పిలుపునిచ్చారు. పట్టణంలోని ఎన్ఆర్‌టీ రోడ్డులో ఉన్న ఆమె నివాసంలో వైఎస్సార్ సీపీ ఫీజు పోరు పోస్టర్లను పార్టీ నాయకులతో కలసి శుక్రవారం ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమాన్ని గాలికి వదిలి వారి భవిష్యత్తును అంధకారమయం చేస్తున్న కూటమి ప్రభుత్వ తీరుకు నిరసనగా ఈ కార్యక్రమం చేపడుతున్నట్లు వివరించారు. ప్రతి జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద శాంతియుత ర్యాలీలు నిర్వహించి, డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ చిలకలూరిపేట, నాదెండ్ల, యడ్లపాడు మండలాల పార్టీ అధ్యక్షులు గుత్తా వేములయ్య, మద్దూరి కోటిరెడ్డి, ఘంటా శంకర్, ఎంపీపీ దేవినేని శంకరరావు, నాదెండ్ల జెడ్పీటీసీ సభ్యుడు కాట్రగడ్డ మస్తాన్‌రావు, ముస్లిం కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ షేక్ దరియావలి, పట్టణ పార్టీ క్లస్టర్ -2 అధ్యక్షుడు విడదల కమలేంద్ర, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ సింగారెడ్డి కోటిరెడ్డి, పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కందుల శ్రీకాంత్, నాయకులు బండారు జయకుమార్, గోపతోటి జాన్, యూసఫ్‌అలీ, సాపా సైదావలి, మానుకొండ శేషిరెడ్డి, ఆముదాల అంజి తదితరులు పాల్గొన్నారు.

కార్యదర్శిగా నిధుల గోల్‌మాల్.. ఈఓపీఆర్డీగా సస్పెన్షన్



గణపవరం పంచాయతీ కార్యాలయం

నాదెండ్ల: గణపవరం మేజర్ పంచాయతీ కార్యాలయంలో నిధులు గోల్‌మాల్ వ్యవహారంలో ఒక ఉద్యోగి సస్పెండ్ అయ్యారు. 2019 సెప్టెంబర్ నుంచి 2022 జులై వరకు పంచాయతీ కార్యదర్శిగా సాంబ శివరావు విధులు నిర్వహించారు. అప్పట్లో ఆయన పంచాయతీ నిధులను సొంత ఖాతాకు మళ్లించుకున్నారని తెనాలి సమీపంలోని నందివెలుగు గ్రామానికి చెందిన బొప్పన సురేంద్రబాబు సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకుని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విచారణ అధికారి డీఎల్‌డీఓ శ్యామలాదేవి అవకతవకలను గుర్తించారు. పారిశుద్ధ్య, తాగునీటి విభాగం కార్మికులకు వేతనాలు చెల్లించే విషయంలో లోపాలను తెలుసుకున్నారు. సాంబశివరావు తన వ్యక్తిగత బ్యాంకు ఖాతాకు నిధులు మళ్లించుకుని, నగదు డ్రా చేసి వేతనాలు చెల్లించినట్లు నివేదికిచ్చారు. సస్పెండ్ అయిన సాంబశివరావు ప్రస్తుతం ప్రకాశం జిల్లా మర్రిపూడి ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ విషయమై అప్పట్లో ఈవోపీఆర్డీగా పని చేసి విశ్రాంత మోషేపై కూడా చర్యలు తీసుకున్నట్లు సమాచారం.

మహా శివరాత్రికి సర్వం సిద్ధం చేయండి

ఆర్డీఓ మురళీ కృష్ణ



అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీ కృష్ణ

గురజాల: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని దైద గ్రామంలోని అమరలింగేశ్వర స్వామి దేవస్థానంలో అన్ని ఏర్పాట్లు చేయాలని గురజాల ఆర్డీఓ మురళీ కృష్ణ అధికారులను ఆదేశించారు. తన కార్యాలయంలో శుక్రవారం పలు శాఖల అధికారులతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ నెల 26న మహా శివరాత్రి సందర్భంగా అమరలింగేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు భారీగా పోటెత్తుతారని చెప్పారు. కనుక ఈ ఏడాది ఎంతమంది భక్తులు వస్తారో అంచనా వేసి, ముందస్తు జాగ్రత్త చర్యలతో పాటు భక్తులకు సౌకర్యాలన్నీ కల్పించాలని సూచించారు. దేవదాయశాఖ అధికారులు క్యూలైన్లు, ఘాట్ శుభ్రత చేపట్టి, గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ఈ సమావేశంలో అటవీ, పంచాయతీ, పోలీస్, ఆర్టీసీ, ఎక్సైజ్ శాఖల అధికారులు పాల్గొన్నారు.

క్రీడలతోనే మానసిక ప్రశాంతత

అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్



పోటీలు ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ

బాపట్ల టౌన్: క్రీడలతోనే మానసిక ప్రశాంతత సాధ్యమని జిల్లా అడిషనల్ ఎస్పీ టి.పి.విఠలేశ్వర్ తెలిపారు. ఎస్పీ తుషార్ డూడీ ఆదేశాల మేరకు పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం జిల్లా పోలీస్ వార్షిక స్పోర్ట్స్ మీట్‌ను ప్రారంభించారు. తొలుత బాపట్ల, రేపల్లె, చీరాల సబ్ డివిజన్ పరిధిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ పోలీసులు క్రీడా మైదానంలో మార్చ్ పాస్ట్ నిర్వహించారు. అడిషనల్ ఎస్పీ జెండా ఊపి, క్రీడా ప్రతిజ్ఞ చేయించారు. శాంతికి చిహ్నమైన తెలుపు కపోతాలను ఎగురవేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 2వ తేదీ వరకు పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. బాపట్ల, చీరాల, రేపల్లె సబ్ డివిజన్‌ల పరిధిలోని ఆర్మ్‌డ్ రిజర్వ్ విభాగంలోని పోలీసు అధికారులు, సిబ్బందిని ఐదు బృందాలుగా విభజించి పోటీలు నిర్వహించనున్నట్లు చెప్పారు. పోలీస్ విధులు ఎంతో ఒత్తిడితో కూడుకుని ఉంటాయని, వాటిని అధిగమించడానికి క్రీడలు ఎంతో తోడ్పడతాయని తెలిపారు. క్రీడల్లో గెలుపు, ఓటములు సహజమని, ఫలితమేదైనా స్ఫూర్తిగా తీసుకుని ముందుకు వెళ్లాలని సూచించారు. ప్రతి ఒక్కరూ క్రీడా స్ఫూర్తిని ప్రదర్శిస్తూ పోటీల్లో పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో చీరాల, బాపట్ల, సీసీఎస్ డీఎస్పీలు మోయిన్, రామాంజనేయులు, శ్రీనివాసరావు, జగదీష్ నాయక్, ఏఆర్ డీఎస్పీ పి.విజయసారథి, పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రన్నింగ్ పోటీలో పోలీసులు



కబడ్డీ క్రీడలో కూత పెడుతూ..

పల్లాకు తెగులుపై అప్రమత్తత అవసరం



క్షేత్ర పర్యటనలో పాల్గొన్న వ్యవసాయాధికారులు

నగరం: మినుములో పల్లాకు తెగులు నివారణకు రైతులు తగిన జాగత్తలు తీసుకోవాలని జిల్లా రైతు శిక్షణ కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు అక్తర్ హుస్సేన్ సూచించారు. మండలంలోని చిన మట్లపూడిలో శుక్రవారం మినుము పంట క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. ఏరువాక శాస్త్రవేత్తలు డాక్టర్ బాలమురళీధర్ నాయక్, డాక్టర్ ఉష పాలాల్ని పరిశీలించి రైతులకు పలు సూచనలిచ్చారు. అక్తర్ హుస్సేన్ మాట్లాడుతూ మినుములో పల్లాకు తెగులు ఆశించిందని, నివారణకు వ్యాధి సోకిన మొక్కను తొలగించి, నాశనం చేయాలని సూచించారు. పంటపై వైరస్ వాహకాలుగా పనిచేసే తెల్లదోమ, తామర పురుగులు, పేనుబంక నివారణకు ఎసిఫేట్ 250గ్రా. లేదా తయోమిథాక్సామ్ 40గ్రా. లేదా ఏసిడమిప్రిడ్ 40గ్రా. మందును ఎకరానికి తగిన నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ఆకు మచ్చ, తుప్పు తెగులు నివారణకు 400గ్రా. మంకోజెబ్ మందును ఎకరానికి వాడుకోవాలని తెలిపారు. ఎక్కడైనా బూడిద తెగులు ఆశిస్తే మైక్లోబూటానిల్ 150గ్రా. మందును ఎకరానికి పిచికారీ చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏవో రమేష్‌బాబు, ఏఈవో నాగశ్రీనివాస్, వీపీఏలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతుడు షేక్.జిలాని

నకరికల్లు: రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాల పాలైన యువకుడు మృత్యువాతపడ్డాడు. ఈ సంఘటన మండలంలోని దేచవరం కుంట సమీపంలో శుక్రవారం జరిగింది. సంఘటనకు సంబంధించి పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మాచర్లకు చెందిన షేక్ జిలానీ(33) తన స్కూటీపై గుంటూరు వెళ్లాడు. తిరిగి మాచర్లకు అదే స్కూటీపై బయలుదేరాడు. మార్గంమధ్యలో దేచవరం కుంట వద్దకు వచ్చేసరికి ఎదురుగా వస్తున్న కారు, బైక్ వేగంగా ఢీకొన్నాయి. స్కూటీ నుజ్జునుజ్జు అయ్యింది. జిలానీకి తీవ్ర గాయాలు కాగా నరసరావుపేటలోని వైద్యశాలకు తరలించగా మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడు జిలానీకి భార్య జమీలు, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ చల్లా సురేష్ తెలిపారు.

పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయకపోవడం దుర్మార్గం

- నరసరావుపేట చేరుకున్న పోలవరం నిర్వాసితుల పతాక యాత్ర జాతా
- బహిరంగ సభలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దడాల సుబ్బారావు



పతాక యాత్రలో పాల్గొన్న పార్టీ నాయకులు

నరసరావుపేట: పోలవరం ప్రాజెక్టు, నిర్వాసితుల ప్రయోజనాలను 19 ఏళ్లుగా పట్టించుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రాజకీయం చేస్తున్నాయని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు దడాల సుబ్బారావు అన్నారు. నిర్వాసితులకు మొక్కుబడిగా న్యాయం చేసి, వారికి మౌలిక సదుపాయాలు కల్పించకుండా ప్రాజెక్టు పనులు మొదలు పెట్టడం ప్రభుత్వాలకు ఏమాత్రం తగదన్నారు. నెల్లూరు జిల్లాలో జరగనున్న 27వ రాష్ట్ర మహాసభల సందర్భంగా పోలవరం నిర్వాసితులకు న్యాయం చేయాలన్న ప్రధాన ఎజెండాతో ఈ నెల 28న పోలవరం నుంచి నెల్లూరు బయలుదేరిన పోలవరం నిర్వాసితుల పతాక యాత్ర జాతా శుక్రవారం సాయంత్రానికి పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేట చేరుకుంది. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ప్రచార జాతాకు పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు వి.కృష్ణయ్య, గుంటూరు విజయ్‌కుమార్ ఘన స్వాగతం పలికారు. ర్యాలీగా వినుకొండ రోడ్డులోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద ఏర్పాటు చేసిన బహిరంగ సభకు చేరుకున్నారు. పార్టీ జిల్లా కమిటీ సభ్యురాలు డి.శివకుమారి అధ్యక్షతన నిర్వహించిన సభలో సుబ్బారావు మాట్లాడుతూ పోలవరం నిర్వాసితులకు పూర్తిస్థాయిలో పునరావాసం కల్పించి ఆ తరువాత పోలవరం ప్రాజెక్టు పనులు వేగవంతం చేయాలని, నాణ్యత ప్రమాణాలకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఏడాదికి మూడు దఫాలుగా వస్తున్న వర్షాలకు వచ్చే వరదలకు నిర్వాసితులు రక్షణ పొందేందుకు కొండలు, గుట్టలను ఆశ్రయిస్తున్నారని అన్నారు. ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు హెలికాప్టర్లలో చూసి వెళ్లడం కాదని ఒక్కరోజైనా వారితో గడిపితే నిర్వాసితులైన గిరిజనుల బాధలు తెలుస్తాయని అన్నారు. సీనియర్ నాయకులు గద్దె చలమయ్య, మహిళా సంఘం నాయకులు ఉమశ్రీ, రజిని, మల్లీశ్వరి, దుర్గాబాయ్, నాగమ్మ భాయ్, నాయకులు లక్ష్మీశ్వరరెడ్డి, హనుమంత రెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.


బోల్తాపడిన కంటైనర్ లారీ



బోల్తా కొట్టిన లారీ వద్ద స్థానికులు

నకరికల్లు: విపరీతంగా కమ్ముకున్న పొగ మంచుకు డ్రైవర్ నిద్ర మత్తు తోడవడంతో భారీ కంటైనర్ అదుపు తప్పి బోల్తాపడింది. సమీపంలో ప్రజలెవరూ లేకపోవడంతో ప్రాణపాయం తప్పింది. ఈ ఘటన స్థానిక పోలీస్ స్టేషన్ ఎదుట అద్దంకి–నార్కట్‌పల్లి రాష్ట్ర రహదారిపై శుక్రవారం తెల్లవారు ఝామున జరిగింది. వివరాల మేరకు.. చెన్నై వైపు నుంచి హైదరాబాద్ వైపు వెళ్తున్న కంటైనర్ ఉదయం 5 గంటల సమయంలో పోలీస్ స్టేషన్‌కు ఎదురుగా రహదారి మలుపు వద్ద అదుపు తప్పింది. హైవే గోడను వేగంగా ఢీకొట్టింది. దీంతో హైవేపై నుంచి సర్వీస్ రోడ్డులో భారీ శబ్దంతో బోల్తాపడింది. ప్రమాదంతో సమీప నివాసితులు ఉలిక్కిపడ్డారు. రోడ్డుపై జనసంచారం లేకపోవడంతో ప్రమాదం తప్పింది. ఎస్ఐ చల్లా సురేష్ క్రేన్‌ల ద్వారా లారీని పక్కకు తీసి, రాకపోకలను క్రమబద్ధీకరించారు. ప్రమాదానికి డ్రైవర్ నిద్రమత్తు కారణంగా భావిస్తున్నారు.

శివయ్య మాస్టారుకు విద్యాజ్యోతి అవార్డు



కారెంపూడి: రాజమండ్రి కేంద్రంగా వెలువడుతున్న విద్యా రంగ పత్రిక విద్యా జ్యోతి ప్రతినిధులు కారెంపూడికి చెందిన తమ్మిశెట్టి శివయ్య మాస్టారుకు శుక్రవారం రాజమండ్రిలో అవార్డు ప్రదానం చేశారు. గుంటూరులోని సెయింట్ ఇగ్నేషియస్ ఇంగ్లిష్ మీడియం స్కూల్ ప్రిన్సిపల్ శివయ్యను విద్యాజ్యోతి- 2025 అవార్డుకు ఎంపిక చేసినట్లు పత్రిక స్పెషల్ ఎడిటర్ జె.రమేష్ రాజా తెలిపారు. ఉత్తమ విద్యార్థులను తయారు చేస్తూ, విద్యా రంగానికి చేస్తున్న సేవలకు గాను అవార్డు ప్రదానం చేసినట్లు వెల్లడించారు.

నిలిపి ఉన్న కారులో నగదు చోరీ



కారు వద్ద వివరాలు వెల్లడిస్తున్న బాధితుడు ప్రకాశరావు

చిలకలూరిపేట: ఆగి ఉన్న కారు అద్దం పగలగొట్టి, నగదు దొంగతనానికి పాల్పడిన ఘటన పట్టణంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద శుక్రవారం చోటు చేసుకుంది. బాధితుడు నకరికల్లుకు చెందిన చందోలు ప్రకాశరావు వివరాల మేరకు.. మండలంలోని యడవల్లి గ్రామం వద్ద ప్రకాశరావు భూమి కొనుగోలు చేశాడు. రిజిస్ట్రేషన్ సందర్భంగా సాయంత్రం 4 గంటలకు సంతకాలు పెట్టేందుకు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనికి వెళ్లాడు. వెళ్లే ముందు రూ.86 వేలు నగదు ఉన్న బ్యాగును కారులో పెట్టి లాక్ చేశాడు. ఇది గమనించిన దొంగలు చాకచక్యంగా కారు డోరు అద్దం శబ్దం కాకుండా కెమికల్స్ ఉపయోగించి తొలగించి దొంగతనానికి పాల్పడ్డారు. నగదు తీసుకుని బ్యాగును ఎన్ఆర్‌టీ సెంటర్‌లో ఓ హోటల్ ఎదురుగా పడేశారు. బ్యాగులో చెక్ బుక్, ఫోన్ నంబర్ ఉండటంతో.. గమనించిన స్థానికులు ప్రకాశరావుకు ఫోన్ చేసి చెప్పారు. కార్యాలయానికి చేరుకొని బాధితుడికి బ్యాగ్ అప్పగించారు. ప్రకాశరావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో.. పట్టణ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని వివరాలు నమోదు చేసుకున్నారు.

రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ మృతి



మృతి చెందిన పాస్నం గణేష్

రొంపిచర్ల: మండలంలోని మర్రిచెట్టుపాలెం సమీపంలో శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి ఎక్స్‌ప్రెస్‌వేపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో లారీ డ్రైవర్ పాస్నం గణేష్ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కోడి మాంసం వ్యర్థాలతో లారీ నెల్లూరు వైపు వెళ్తోంది. ఆ లారీ మర్రిచెట్టుపాలెం సమీపంలోకి రాగానే ముందు భాగంలో వెళ్తున్న మరో లారీని ఢీకొట్టింది. నిద్రమత్తులో అతి వేగంగా లారీ నడిపడం వల్లే ఈ ప్రమాదం జరిగిందని స్థానికులు తెలుపుతున్నారు. లారీ ఢీకొనగానే డ్రైవర్ పాస్నం గణేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన డ్రైవర్‌ను నరసరావుపేట వైద్యశాలకు తరలిస్తుండగా మృతి చెందాడు. మృతి చెందిన లారీ డ్రైవర్ పాస్నం గణేష్ తెలంగాణలోని సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మండలం వెలిశాల గ్రామానికి చెందిన వ్యక్తిగా గుర్తించారు. గణేష్‌కు భార్య, ఆరేళ్ల కూతురు, ఏడాదిన్నర వయస్సు గల కుమారుడు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న ఎస్ఐ మణికృష్ణ ఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.